# అల్లుడా! మజాకా!

"రా బోయే దీపావళి పండగను తలచుకుని బెంబేలెత్తిపోతున్నాడు సుబ్రావ్. పెళ్ళైన మొదటి సంవత్సరంలో వస్తోన్న తొలి దీపావళి పండగ. భర్త సుబ్రావ్ ఎందుకు డీలాపడుతున్నాడో అర్థంకాలేదు జగదాంబకు. పండగ మాట ఎత్తినప్పుడల్లా చిర్రుబుర్రు లాడటం గమనించింది.

వారం రోజుల ముందే పండక్కి కొత్త అల్లుణ్ణి ఆహ్వానించడానికి వచ్చాడు శంభులింగం. ఆరోజు ఆదివారం కావడంతో ఆఫీసుకి సెలవు. సుబ్రావ్ ఇంటిదగ్గరే వున్నాడు. కన్నతండ్రి రాకతో తారజువ్వలా జగదాంబ ముఖం వెలిగిపోయింది. శంభులింగం స్నానాదికాలు ముగించి... హాల్లో సోఫాలో కూర్చుని పేపరు చదువుతున్న అల్లుడు దగ్గరకు వచ్చాడు.

''రాండి! బాగా నిద్రపట్టిందా?'' కూర్చోడానికి కుర్చీని చూపిస్తూ అడిగాడు సుబ్రావ్.

అల్లుడి కుశల ప్రశ్నకు చాలా సంతోషించాడు శంభులింగం.

''ఆ... బాగానే పట్టింది బాబూ! పోతే...'' తను చెప్ప బోయే దానికి నాందిగా గొంతు సవరించుకున్నాడు.

ప్రశ్నార్థకంగా మామగారివైపు చూశాడు సుబ్రావ్.

''పండక్కి వారంరోజుల ముందే నువ్వూ, అమ్మాయి రావాలి. ఆ విషయం చెప్పి ఇద్దర్నీ తీసుకెళదామని వచ్చాను బాబూ?'' తను వచ్చిన పని మెల్లగా అల్లుడి చెవిన వేశాడు శంభులింగం.

''పండగా...?! ఇప్పుడేముందీ?'' ఆశ్చర్యం నటిస్తూ దీర్ఘం తీశాడు సుబ్రావ్.

అల్లుడివైపు వింతగా చూశాడు శంభులింగం. అల్లుడు మరీ బెట్టు చేస్తున్నాడనుకున్నాడు.

''ఏం పడగని అడుగుతారేంటి అల్లుడూ! దీపావళి కదా! పైగా ఆరోజే అమ్మాయి జగదాంబ పుట్టినరోజు కూడానూ...! అన్ని ఏర్పాట్లు ఘనంగా చేస్తున్నాం...'' అల్లుడి ప్రశ్నకు ఆనందంతో సమాధానం చెప్పాడు శంభులింగం.

ఏమాటైతే తన చెవులతో వినకూడదనుకున్నాడో

**వంగర పరమేశ్వరరావు**

'దీపావళి' అనే పేరు మామగారి నోట వినేసరికి ముచ్చెమటలు పోశాయి సుబ్రావ్‌కి. నీరసంతో కళ్ళు తిరుగుతున్నట్లు అనిపించింది. నిస్సత్తువతో కూర్చున్న సోఫాలోనే స్పృహ తప్పి పడిపోయాడు.

అల్లుడి వాలకం చూసి కంగారుపడ్డాడు శంభులింగం. భర్త సోఫాలో ఒరిగిపోవడంతో బిత్తరపోయింది జగదాంబ. భర్తకు ఏదో జరిగిందనే ఆందోళనతో ''అయ్యో! ఏమండీ...!'' అంటూ ఏడవటం ప్రారంభించింది. క్షణంలో వాతావరణం మారిపోవడంతో శంభులింగం మనసు కీడు శంకించింది. గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి. గుండెను దిటవు చేసుకుంటూ ''అమ్మాయ్! ముందు నీ ఏడుపాపు! వెళ్ళి గ్లాసుడు నీళ్ళు తీసుకురా!'' అన్నాడు కూతురుతో.

జగదాంబ పురుగున వెళ్ళి చిటికెలో గ్లాసుతో నీళ్ళు తెచ్చి తండ్రి చేతికిచ్చింది. నీళ్ళు చేతిలో పోసుకుని అల్లుడి ముఖంపై చిలకరించాడు శంభులింగం.

కాసేపట్లో సుబ్రావ్ ఉలిక్కిపడి లేస్తూ.... ''బాంబులు బాబోయ్! బాంబులు!...'' పలవరించాడు.

అల్లుడు లేవడంతో ''అమ్మయ్య?'' అని ఊపిరి పీల్చుకున్నాడు శంభులింగం.

''అదేంటి అల్లుడూ! అన్నిరకాల బాంబులు నీచేత కాల్పించాలని నీ ముద్దుల బామ్మర్ది ఇల్లంతా కొని స్టాక్ పెట్టాడు. నువ్వొచ్చి కాలిస్తే ధైర్యం తెచ్చుకుని నీ ఆసరాతో తనూ కాల్చాలని తెగ ఉబలాటపడుతున్నాడు. 'బావను త్వరగా తీసుకురా!' అంటూ ఒకటే గోల. కాబట్టి వెంటనే ప్రయాణమవ్వండి...'' హడావిడి చేశాడు శంభులింగం.

శంభులింగం మాటలు విని గ్లాసుడు నీళ్ళు గటగటా తాగేశాడు సుబ్రావ్. ముచ్చెమటలు దిగ్గారుతోన్న అతని వాలకం చూసి ఫ్యాను స్పీడు పెంచింది జగదాంబ. అయినా ఇంకా గాలి సరిపోలేదనుకున్న శంభులింగం ''అమ్మాయ్! విసనకర్ర పట్రా!'' అన్నాడు కూతురితో.

క్షణంలో తీసుకొచ్చి ఇచ్చింది జగదాంబ.

సుబ్రావ్ నోటివెంట మాటలు రావడంలేదు. బిత్తర చూపులు చూస్తున్నాడు. సోఫాలో వెనక్కివాలి తన కాళ్ళ వైపు, చేతులవైపు పదేపదే చూసుకోవడం ప్రారంభించాడు.

''దొంగలు బాబోయ్! దొంగలు!'' అనే సినిమా

టైటిల్ పేరు వింది కానీ... ఇలా భర్తనోటివెంట 'బాంబులు బాబోయ్! బాంబులు...' అంటూ మొదటి సారిగా వినటం, భర్త పదే పదే కాళ్ళూ చేతులవైపు పిచ్చి చూపులు చూసుకోవడం గమనించి భోరున ఏడవటం ప్రారంభించింది.

విషయం అర్థంకాని శంభులింగం జుట్టు పీక్కున్నాడు "అల్లుడూ... ఎలావుంది... హాస్పిటల్‌కు వెళదామా!" మెల్లగా అడిగాడు.

ఉలుకూ పలుకూ లేకుండా తదేకంగా ఎదురుగా వున్న గోడను చూస్తోన్న అల్లుడి దృష్టిని గమనించాడు శంభులింగం. 'దేన్ని ఇంత తదేకంగా చూస్తున్నాడా?' అని గోడను పరికించాడు.

అందచందాలను ఒలకబోస్తూ అర్ధనగ్నంగా వున్న సినిమా హీరోయిన్ కొంటెగా నవ్వుతూ ఉన్న క్యాలెండర్ కనపడింది అతనికి. దాంతో అల్లుడి శీలంపట్ల అనుమాన బీజం మొలకెత్తింది అతనిలో. పెళ్ళైన సంవత్సరానికే తన కూతురి జీవితం కష్టాల గాటినపడిందని ఊహించాడు. అల్లుడికి విసరటం ఆపి... కూతుర్ని పక్కకు పిలిచి గుసగుసలాడాడు. "అమ్మాయ్! ఏవిటి మీవారి వాలకం! మాటామంతీ లేకుండా ఆ బొమ్మవైపే చూస్తున్నాడు. కాపరం సరిగా వెలగబెడుతున్నాడా? పెందరాళే కొంపకు తగలడుతున్నాడా? నీకేమైనా అతను చిన్నిల్లు పెట్టినట్టు అనుమానం వచ్చే క్లూ ఏదైనా దొరికిందా...?" ప్రశ్నల వర్షం కురిపించాడు.

తండ్రి మాటలకు రెండు చెవులు మూసుకొని "శ్రీరామచంద్రా!" అంటూ తన మంగళ సూత్రాన్ని బయటకు తీసి కళ్ళకద్దుకొంది జగదాంబ.

తండ్రీకూతుళ్ళు గుసగుసలాడుకుంటుంటే సుబ్రావ్ మెల్లగాలేచి బాత్రూమ్‌వైపు వెళ్ళడం చూశారు.

బాత్‌రూమ్‌లోకి వెళ్ళి పట్టిన చెమటను సబ్బుతో కడుక్కొన్నాడు. తన చేతులపై, కాళ్ళపై కాలిన మచ్చలు చూసుకున్నాడు. గతం లీలగా అతని కళ్ళముందు మెదిలింది.

సుబ్రావ్‌కి ఆరేళ్ళు. ఆరోజు దీపావళి. తలంటుపోసుకుని, కొత్తబట్టలు కట్టుకుని దీపావళి మందులు కోసం బజారుకు వెళ్ళాడు. రోడ్డుమీద ఎవరో బాంబును అంటించి. పెట్టారు. సుబ్రావ్ దాన్ని గమనించలేదు. అది పేలే సమయానికి సుబ్రావ్ దాని సమీపానికి వచ్చాడు. పెద్ద శబ్దంతో "ఢాం!" అని పేలింది. సుబ్రావ్ బట్టలమీద నిప్పురవ్వలు పడి క్షణాల్లో బట్టలు కాలాయి. చేతులు, కాళ్ళమీద టపాసు తాకిడికి కాలిన బొబ్బలొచ్చాయి. ఆ దెబ్బతో నెలరోజులు సుబ్రావ్ భయంతో "బాంబులు బాబోయ్! బాంబులు!" అని పలవరిస్తూ మంచం పట్టాడు.

సుబ్రావ్ తల్లి కొడుకు త్వరగా కోలుకోవాలని ముక్కోటి దేవుళ్ళకు మొక్కుకుంది. చివరకు జ్వరం తగ్గిందికానీ... టపాసుల తాలూకూ భయం అతనిలో శాశ్వతంగా నిలిచిపోయింది. అప్పట్నుంచి దీపావళికి దూరంగా వుంటూ వచ్చాడు. అయినా అతనిలో భయం ఇంకా మిగిలేవుంది. మళ్ళీ టపాసుల మాట మామనోట వినేసరికి అతనిలో భయం పడగవిప్పింది. కానీ కొత్త భార్య, మామగారి ముందు తన భయం బయటపడితే పరువుపోతుందని... ధైర్యాన్ని కూడదీసుకుని... ముఖాన్ని సోప్‌తో కడుక్కొని 'ఫ్రెష్' అయి ఇంట్లో కొచ్చాడు.

ఏడుస్తున్న భార్యను, దిగాలుగా వున్న మామగార్ని చూశాడు. తెచ్చిపెట్టుకున్న ధైర్యంతో ఫోజుపెట్టి... "మిమ్మల్ని తమాషాగా ఆటపట్టించడానికే ఇలా ప్లే చేశా. చిన్నప్పట్నుంచీ బాంబులను కాల్చే పోటీల్లో పాల్గొని ఎన్నో ప్రైజులు తెచ్చుకున్నాను. బామ్మర్దికి ధైర్యం చెప్పండి! ఈసారి పండగ ఘనంగా జీవితంలో గుర్తుండి పోయేటట్లు చేద్దాం!" మీసం మెలేసూ అన్నాడు సుబ్రావ్.

జగదాంబ ముఖంపై చిర్నవ్వు వెలిగింది. శంభులింగం కళ్ళల్లో ఆనందం తాండవించింది.

"మొత్తానికి భలే హడలుగొట్టేశావ్! అల్లుడూ!" సుబ్రావ్ భుజం తట్టాడు.

మామ రిజర్వేషన్ టిక్కెట్లు తీసుకురావడంతో అత్తవారింటికి సుబ్రావ్ పండగ ప్రయాణం ఖరారైంది.ఔ

గుండెల్లో రైళ్ళు పరుగెడుతున్నా... గుండెలనిండా ధైర్యాన్ని నింపుకుని భార్యతో కలిసి బయల్దేరాడు.

అల్లుడు రాకతో శంభులింగం కుటుంబసభ్యులందరూ పనుల్లో బిజీ అయ్యారు. సుబ్రావ్‌కి సకల మర్యాదలతో ఘనంగా చూసుకుంటున్నారు.

"బావా! టపాసులు!" అంటూ సుబ్రావ్ బావమర్ది క్షణం వదలకుండా బోలెడు కబుర్లు చెబుతూ తిరుగుతున్నాడు. అతని మాటలకి వెన్నులో సన్నని వొణుకు ప్రారంభమైంది సుబ్రావ్‌లో.

సుబ్రావ్ వెళ్ళిన మూడోరోజు అతని బామ్మర్ది పదేళ్ళ దత్తు ఒక పాంప్లేట్ తెచ్చి తన అక్క జగదాంబకు ఇచ్చాడు. దీపావళి సందర్భంగా ఆ ఊర్లో 'బాంబులు పేల్చే పోటీ' కార్యక్రమం ఏర్పర్చారు. పదినిముషాల్లో

ఎవరు ఎక్కువ బాంబులు కాలిస్తే... వారికి ప్రథమ బహుమతిగా పదివేలు ప్రకటించారు. ఆ విషయం శంభులింగం కుటుంబమందరికి తెలిసింది. చిన్నప్పుడే ఎన్నో ప్రైజులు పొందిన తన అల్లుడు సునాయాసంగా ఈ పోటీలో బహుమతి గెలుచుకోగలడని ధీమా వ్యక్తం చేశారు.

అందరూ అల్లుడి బాల్యవీరోచిత సాహసాల్ని కథలు కథలుగా పొరుగిళ్ళకు ప్రసారం చేశారు. దాంతో సాయంత్రానికల్లా ఎందరో అభిమానులు ఏర్పడ్డారు సుబ్రావ్‌కి. ''బాంబుల వీరుడు సుబ్రావ్ గారూ! జిందాబాద్!'' అంటూ దిక్కులు దద్దరిల్లేటట్లు నినాదాల్ని హోరెత్తించారు. దాంతో పోటీలో సుబ్రావ్ పాల్గొనడం తప్పనిసరైంది.

ఈ గండం నుంచి తను ఎలా బయటపడాలా అని సుబ్రావ్ బుర్ర పదునుగా ఆలోచించటం మొదలుపెట్టింది. పోటీ రోజు శంభులింగం ఇంటి ముందు ఇసుకేస్తే రాలనంత జనం గుమిగూడారు. సుబ్రావ్ నుదుటిన వీరతిలకం దిద్దారు. ''బాంబుల సింహం సుబ్రావ్! జిందాబాద్!... వీరకిశోరం సుబ్రావ్!'' అంటూ నినాదాలు చేస్తూ సుబ్రావ్‌ని తీసుకుని పోటీ స్థలానికి బయలుదేరారు.

బజారుల్లో జనం సుబ్రావ్‌ని చూడటంకోసం గుమిగూడారు. సుబ్రావ్ కాళ్ళల్లో వణుకు సన్నగా ప్రారంభమైంది. అయినా తనను వీరుడిగా వర్ణిస్తూ నినాదాలు చేస్తుండటంతో మేకబోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ... అందరికీ నమస్కారం చేస్తూ సాగిపోతున్నాడు ట్రాక్టరుపై! కొద్దిక్షణాల్లో రాబోతున్న పదివేలతో ఏయే వస్తువులు కొనాలో... ఆలోచనలో పడింది జగదాంబ. తన అల్లుడి ప్రతాపంతో ఊర్లో తన పేరు శాశ్వత కీర్తిపతాకాన్ని ఎగరవేయబోతుందని మురిసిపోతున్నాడు శంభులింగం.

పోటీ ప్రారంభమైంది. అనేకమంది కాలుస్తోన్న టపాసుల సంఖ్యను కమిటీవారు నోట్ చేసుకుంటున్నారు. అరగంట తర్వాత సుబ్రావ్ పేరును మైకులో ఎనౌన్సు చేశారు. కాళ్ళు గిర్రున తిరగనారంభించాయి సుబ్రావ్‌కి. తూలిపోతోన్న అతనికి నిమ్మరసం తాగించి ధైర్యం చెప్పారు. బరిలోకి పట్టుకుని తీసుకెళ్ళి నిలబెట్టారు. తన కాళ్ళకింద భూమి రెండుగా చీలిపోతున్నట్లనిపించింది సుబ్రావ్‌కి. టపాసులను కాల్చటానికి అగ్గిపెట్టెను చేతికిచ్చారు. క్షణంలో అది తడిసి ముద్దైంది. నిర్ఘాంత పోయారు నిర్వాహకులు. మరో అగ్గిపెట్టెను ఇచ్చారు. సుబ్రావ్ శరీరం నుంచి కారుతున్న చెమట అగ్గిపెట్టెను తడిపేస్తుండటం గమనించారు. అరడజనుకుపైగా అగ్గిపెట్టెలు తడిశాయి. సుబ్రావ్ మాత్రం ఒక్క టపాసును పేల్చలేదు. చివరకు కడుపులో నొప్పిగా ఉందని సైగ చేస్తూ... మైదానాన్ని వదిలి పరుగెత్తసాగాడు. శంభులింగం, జగదాంబ, దత్త నిర్ఘాంతపోయారు.

అర్థంకాని జనం సుబ్రావ్ వెంటపడ్డారు. ■

## ఆది నుండి తుదకు...

హంస తూలికా తల్పం కాదది
కానీ...,
అలసిన వేళల ఆదరింపు
పగలంతా పడిన శ్రమకు
జవాబు
తలకు గుడ్డతో అమ్మ
పసిబిడ్డకు పాలు కుడిపేది అక్కడే
బాల్యపు అల్లరికి వేదిక
జీవిత భాగస్వామి మధుర జ్ఞాపకం
తీరని రోగంలో
ఆసరా అవుతూ
వృద్ధాప్యంలో
తోడూ నీడా నేనున్నానంటూ...

-కోపూరి పుష్పాదేవి

## తేడా

ఆడడం, పాడడం
ఉరకడం, గెంతడం
అల్లర్లు, ఆనందాలు
ఒకప్పటి బాల్యం!
సినిమాలు, టీవీలు
కంప్యూటర్, వీడియోలు
పుస్తకాలు, పోటీలు
ఇప్పటి బాల్యం!

-కందుకూరి రమాభారతి